క్లుప్తంగా

నేడు అత్యవసర సర్వసభ్య సమావేశం

నడిగూడెం : నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు అత్యవసరంగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

హోమియో వైద్యాధికారిగా శృతి


పేషెంట్‌కు వైద్యం చేస్తున్న డాక్టర్ శృతి

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హోమియో వైద్యాధికారిగా ఆర్.శృతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆమె మొట్టమొదటి పోస్టింగ్ ఇక్కడే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన హోమియో వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషిచేస్తానని అన్నారు.

పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ


విద్యార్థుల హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండల కేంద్రంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం స్థానిక ఎంపీడీఓ జానకిరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని సెయింటాన్స్ ఉన్నత పాఠశాల, వీవీ హైస్కూల్‌లో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ ఆంజనేయులు, వీఆర్‌ఏ నాగుల్‌మీరా తదితరులున్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో అంబేద్కర్ జయంతి, విగ్రహావిష్కరణ సందర్భంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన యువజన సంఘాల నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులు వరుసగా రూ.7,016, రూ.5.016, రూ.4,016ల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 12న మహిళలకు గ్రామస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు అభినందనీయం


భోజనం వడ్డిస్తున్న బీఎస్పీ నాయకులు

కోదాడ : కోదాడ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు బహుజన సమాజ్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ భోజన వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం గ్రంథాలయాన్ని సందర్శించి పిల్లుట్ల శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.ముత్యాలు, డీవైఎఫ్ఐ నాయకులు నరసింహారావు, బీఎస్పీ నాయకులు చింతల రమేష్, జ్యోతి, సోమయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌రావుకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి : ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకే ప్రజా కళలు అని అరుణోదయ జిల్లా నాయకుడు గుండు నగేష్ అన్నారు. సోమవారం మండలంలోని వెలిదండలో అరుణోదయ వ్యవస్థాపకుడు కానూరి వెంకటేష్‌రావు 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా నాయకుడు అదురు శ్రీను, అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు మేకల కనకరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి వీసాల వెంకటేశ్వర్లు, రాజు, తిరుపతయ్య, సైదులు, గోపి, మల్లయ్య, అశోక్, శివ తదితరులున్నారు.

సేవలు మిన్న.. సౌకర్యాలు సున్నా

- ప్రభుత్వ హోమియో వైద్యశాలలో కనీస వసతులు కరువు
- అరకొరగా మందుల సరఫరా
- వైద్యానికి ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి వస్తున్న రోగులు
- ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు



కోదాడలో పాత భవనంలో కొనసాగుతున్న హోమియో వైద్యశాల

కోదాడ : నిత్యం వందల మంది పేద రోగులకు విలువైన వైద్య సేవలందిస్తున్న కోదాడ ప్రభుత్వ హోమియో వైద్యశాలకు కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు మంచి వైద్య సేవలు అందిస్తుండడంతో ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి సైతం రోగులు వస్తున్నారు. కానీ మాత్రం ఆస్పత్రిలో కూర్చోవడానికి కూడా వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. రోగులకు మందులు కూడా అరకొరగా అందుతున్నాయని రోగులు చెబుతున్నారు. అయితే ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేకమార్లు తెలియజేసినా వారు దృష్టి పెట్టిన దాఖలాలు లేవని పలువురు రోగులు అంటున్నారు.

2015లో ఏర్పాటు..

కాగా కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో 2015లో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) పథకం కింద కేంద్ర ప్రభుత్వం హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసింది. కాగా ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న డాక్టర్ క్వార్టర్‌లో దీనిని కొనసాగిస్తున్నారు. మొదట రెండు సంవత్సరాలు ఇక్కడ పనిచేయడానికి వైద్యులు ఎవరూ ముందుకు రాలేదు. ఆ తరువాత వచ్చిన వైద్యురాలు అంకితభావంతో సేవలందిస్తుండడంతో రోజుకు 200 మంది వరకు రోగులు ఈ వైద్యశాలకు వస్తున్నారు. రోగులకు సరిపడా మందులు కూడా లేకపోవడంతో కొందరు దాతలు ముందుకొచ్చి వైద్యశాలకు కావాల్సిన మందులను అందించేవారు. మరికొంత మంది వైద్యశాలకు కావాల్సిన ఫర్నిచర్ కూడా అందించారు. మేళ్లచెరువుకు చెందిన సిమెంట్ పరిశ్రమ వారు రోగులు కూర్చోవడానికి రేకుల షెడ్‌తో పాటు బల్లలను ఏర్పాటు చేశారు. కాగా ఈ హోమీయో వైద్యశాలలో రోగులకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సౌకర్యం కూడా కరువయ్యాయి. స్త్రీలను పరిక్షించడానికి ప్రత్యేక గది కూడా లేదు. అంతేకాకుండా డాక్టర్ క్వార్టర్‌లో పాత సామన్లు వేస్తుండడంతో ఇక్కడ పనిచేయడం వైద్యురాలికి అసౌకర్యంగా ఉందని రోగులే చెబుతున్నారు. ఇప్పటికైనా కోదాడలోని హోమీయో వైద్యశాల అందిస్తున్న సేవలను గుర్తించి కనీస వసతులతో పాటు నిత్యం మందులు సరఫరా అయ్యేవిధంగా చూడాలని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దాతలు సౌకర్యాలు కల్పించాలి



కోదాడ ప్రభుత్వ హోమియో వైద్యశాల పేద రోగులకు విలువైన వైద్య సేవలందిస్తోంది. దీంతో స్థానిక ప్రజలతో పాటు ఇతర జిల్లాల నుంచి రోగులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. వైద్యాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నా బుట్టదాఖలు అవుతున్నాయి. దాతలు ముందుకు వచ్చి ఈ వైద్యశాలకు కనీస వసతులతో పాటు మందులు అందిస్తే పేద రోగులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కనగాల జనార్దన్‌రావు, సామాజిక కార్యకర్త, కోదాడ

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించాలి


ఆర్డీఓ వెంకారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నాయకులు

హుజూర్‌నగర్ : రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించాలని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దేశగాని సాంబశివ గౌడ్ కోరారు. మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గతంలో ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి స్థలాన్ని చూపించాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ వెంకారెడ్డికి బీఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూరుగడ్డలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 15, 16లలో గతంలో రెవెన్యూ అధికారులు 186 మందికి ఇంటి స్థలం పట్టాలు ఇచ్చారని తెలిపారు. కానీ ఆ లబ్ధిదారులకు స్థలం చూపకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు స్థలాలు చూపాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా, నియోజకవర్గ నాయకులు సీహెచ్.రవికుమార్, బి.సుబ్బు గౌడ్, కె.నరసింహారావు, మంద రవి, రమణ, హుస్సేన్, కరుణాకర్, నాగుల్ బి.గోపి పాల్గొన్నారు.

'ఇంటింటికీ సీపీఐ' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : బీజేపీ హటావో– దేశ్‌కి బచావో అనే నినాదంలో ఈనెల 14వ తేదీ నుంచి మే 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఇంటింటికి సీపీఐ కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి విడుదల చేసి మాట్లాడారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు యడ్ల అంజిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తిరుపతయ్య, ఈద మధు, లింగరాజు, శ్రీనివాస్, కోణారెడ్డి, సైదులు, గురువయ్య, తదితరులు ఉన్నారు.

16న కోదాడలో ఆత్మీయ సమ్మేళనం


కోదాడలోని 19వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ఈ నెల 16న నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, పట్టణ అధ్యక్షురాలు ఇర్ల రోజారమణి కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని 19వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి పార్టీలోని అన్ని అనుబంధ సంఘాల నాయకులతో పాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, పోటు రంగారావు, సంగిశెట్టి గోపాల్, వేశేపల్లి యాదగిరిరావు, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి


నడిగూడెంలో ప్రైవేటు కొనుగోలుదారుల కాంటాను పరిశీలిస్తున్న భీమయ్యగౌడ్

నడిగూడెం : మండలంలో తక్షణమే ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా భీమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధాన్యం కాంటాను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, క్వింటాకు మద్దతు ధర రూ.2500 పెంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ కోశాధికారి పాతకొట్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నేలమర్రి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి మిల్లర్లను కాపాడే ప్రయత్నం


సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

ఆత్మకూర్ (ఎస్) : కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా, అవినీతికి పాల్పడిన మిల్లర్లను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం నెమ్మికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయని, ఏ గ్రామానికి వెళ్లినా రైతులు రోడ్లు, కల్లాల్లో వరి రాశులు పోశారన్నారు. అయినా ప్రభుత్వం నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కుమ్మక్కై జిల్లాలో 11వందల కోట్ల సీఎంఆర్ ధాన్యంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మిల్లర్లకు లాభం చేకూర్చేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే డీఆర్‌డీఏ, వ్యవసాయ, సివిల్ సప్లయ్, డీసీఎంఎస్ తదితర శాఖలతో సమీక్ష జరపాల్సి ఉండగా నేటికీ జరపలేదని అన్నారు. కోసిన ధాన్యం ఎక్కడ పోయాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, ఎండీ అస్లాం, సంధ్యాల సైదులు, వీరేందర్, పాటి కరుణాకర్ రెడ్డి, గిరి, పాపయ్య, సుందరయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ, సంతాపం


నివాళులర్పిస్తున్న కడియం రామచంద్రయ్య, నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీజేపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు నల్లు దుష్యంత్‌రెడ్డి తండ్రి నల్లు చంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, అసెంబ్లీ కోకన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి మేడెబోయిన యాదగిరి, బీజేవైఎం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాం తదితరులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, పాక వీరేష్‌యాదవ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అంగోతు శ్రీనివాస్‌నాయక్, జిన్నె అశ్విన్, బింగి వెంకన్న, వేముల సత్తయ్య ఉన్నారు.

వివిధ పార్టీల నాయకులు..

చంద్రారెడ్డి భౌతికకాయానికి జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ బొడ్డు రామలింగయ్య, గానుగుబండ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి నివాళులర్పించి సంతాపం తెలిపారు. వారి వెంట లొడంగి లింగరాజు, మెండె సురేష్, అర్జయ్య, రాము, చిరంజీవి ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



తాడువాయిలో కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ బుచ్చిపాపయ్య

మునగాల : ప్రతిఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలని వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య కోరారు. సోమవారం మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల తాడువాయిలో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ లొడంగి సంజీవతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఆర్.వినోద, ఉపసర్పంచ్ దేశగాని నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి సతీష్, వార్డు సభ్యులు నాగమణి, మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్‌ఎం అమరగాని సుచరిత, నర్సమ్మ, లలిత, ఆప్తామాలిక్ అధికారి రమేష్, డీఈఓ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ


అర్వపల్లిలో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ యాదగిరిరెడ్డి

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను వరి ధాన్యం కొనుగోళ్లపై సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ప్యాక్స్ కమిటీ సభ్యులకు సోమవారం సెర్ప్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపు, కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై తహసీల్దార్ పి.యాదగిరిరెడ్డి సభ్యులకు అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏటీఆర్.శశిధర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, ఏఈఓలు శోభారాణి, సత్యం, సీసీలు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన


పల్లె ప్రకృతి వనాలను పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి సాంబరెడ్డి

సూర్యాపేట రూరల్ : పల్లె ప్రకృతి వనాలను సంరక్షించాలని డివిజనల్ పంచాయతీ అధికారి సాంబరెడ్డి అన్నారు. సోమవారం టేకుమట్ల గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ మొక్కలకు నీటిని అందించి సంరక్షించాలని సూచించారు. మొక్కలు చనిపోయిన ప్లేస్‌లో కొత్త మొక్కలు పెట్టాలని, రాబోయే సంవత్సరంలో హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిండిగ పద్మ నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తా

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


కమ్యూనిటీ హాల్‌లో షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని 3వ వార్డులో గల ఎన్‌జీఓస్ కాలనీలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులను, 11వ వార్డులో గల హరిజనవాడలో రూ.3 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమిటీ హాల్‌లో షెడ్‌ను, యాదవ బజారులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని చెప్పారు. జర్నలిస్టులకు స్థానిక ఫణిగిరి గుట్ట వద్ద 200 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలన్నారు. ఈ విషయమై అవసరమైతే కలెక్టర్‌ను కూడా కలిసి విన్నవిస్తానని తెలిపారు. అనంతరం స్థానిక నాయకులు ఎంపీని శాలువా, పూలమాలతో సన్మానించారు. తదుపరి ఎంపీ ఉత్తమ్ పలువురి నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్‌కుమార్, కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, రాజానాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, దొంగరి వెంకటేశ్వర్లు, కారంగుల వెంకటేశ్వర్లు, వెలిదండ వీరారెడ్డి, జైలు, నాగరాజు నిజాముద్దీన్, బి.గిరిబాబు, దేవరం రమాదేవి, మంజునాయక్, జక్కుల మల్లయ్య, వి.వెంకన్న, వీరబాబు, ముక్కంటి, ముత్తయ్య, పెద్ద సైదులు, రవీందర్, రాము, క్రాంతి అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ఎంపీపీ

కోదాడ : ఆపదలో ఉన్న పేదవారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునగాల, నడిగూడెం మండలాలకు చెందిన 206 మంది లబ్ధిదారులకు 96 లక్షల 67 వేల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇబ్బందుల్లో ఉన్న వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో పేదల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నడిగూడెం ఎంపీపీ జ్యోతి మధుబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్లకు పవళింపుసేవ


స్వామివార్లకు దీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ సమేత తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల పవళింపు సేవను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, బాలబోగం, తీర్థ ప్రసాద గోష్ఠి, 9 గంటల నుంచి శ్రీరుక్మిణి సత్యభామ గోదాదేవి సమేత వరహ శ్రీవేణుగోపాలస్వామి వారికి శ్రీ రాజ్యలక్ష్మి నృసింహస్వామి వారికి ఆల్వారాదులకు స్నాపనం, అష్టోత్తర శతఘటాభిషేకం, ఆరగింపు, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శృంగార డోలోత్సవం, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను అర్ధరాత్రి 12 గంటల వరకు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈవో ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురబీ కుషల్, పవన్‌కుమార్, గురవయ్య, రామకృష్ణ, మట్టపల్లి, అంజమ్మ, రామస్వామిగౌడ్, కిరణ్‌గౌడ్, లింగయ్య, ఉపేందర్, రమేష్‌గౌడ్, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, అనంత సింగాచార్యులు, శేషాచార్యులు, అనంతచార్యులు, సప్తగిరిచార్యులు, మధుసూదనాచార్యులు, మనోహరచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెన్‌పహాడ్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుబ్బతండా, మేగ్యాతండాలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెలలో మండల స్థాయిలో నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి అంజయ్య, బీమ్లా, జేతునాయక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మద్దిరాల : ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఆయా శాఖల అధికారులు పాల్గొని కలెక్టరేట్ నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు తెలియజేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వికాస్ పాటిల్, హార్టికల్చర్ అధికారి ప్రవంతి, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, ఏపీఎం మైసయ్య, ఎంపీఓ రాజేష్, ఏపీఓ గుండు వెంకన్న, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా హరీష్

పెన్‌పహాడ్ : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన బిట్టు హరీష్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు రాంబాబుగౌడ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్ను సుదర్శన్‌రెడ్డి, జడ అభినవ్, లక్ష్మీనారాయణ, వీరబాబు, శివయ్య, శంకరయ్య, సంతోష్ పాల్గొన్నారు.

బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంత


వేపలసింగారం రోడ్డులో బ్రిడ్జిపై పడిన గుంత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నుంచి వేపలసిగారం వెళ్లే దారిలో ఎన్నెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. నిత్య వందలాది మంది ప్రయాణించే ఈ బ్రిడ్జిపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగేదాకా అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. అయితే రెండుమూడు నెలల క్రితం ఈ బ్రిడ్జి పైభాగం ఒక వైపు కుంగి కొంత భాగం కూలింది. అప్పట్లో కూలిన చోట కర్రకు జెండాలాంటిది కట్టి హెచ్చరికగా ఉంచారు. కానీ ప్రస్తుతం కూలిన ప్రదేశంలో ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. కాగా హుజూర్‌నగర్ శివారులోని సిమెంట్ పరిశ్రమలకు, రైస్ మిల్లులకు వచ్చి పోయే భారీ వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటుంది. అయినా సంబంధిత అధికారులు ఈ బ్రిడ్జిపై గుంతను పూడ్చే పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిని పునరుద్ధరించాలని, అప్పటివరకు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్‌ను వివరణ కోరగా బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.